
సాక్షి
అనంతపురం

బుధవారం। 28। ఆగస్టు। 2024



చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.15 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.5°/23.8°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి.



వైద్యులకు రక్షణ లేకపోతే ఎలా?

రోగులకు మెరుగైన సేవలందించే డాక్టర్లకు రక్షణ కల్పించాలి. వైద్యులకు ఆసుపత్రిలోనే రక్షణ లేకపోతే ఎలా? ఈ విషయాన్ని దేశ ప్రజలు, ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించాలి. కోల్‌కతాలో వైద్య విద్యార్థి హత్యాచార ఘటనకు కారకులైన ప్రతి ఒక్కరినీ శిక్షించాలి. ఇంతవరకూ ఎప్పుడూ వేయనటువంటి శిక్ష వేయాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు అన్ని చర్యలూ తీసుకోవాలి.

– డాక్టర్ నవీన్‌కుమార్ బాబు, నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్, గుంతకల్లు మండలం



పటిష్ట భద్రత కల్పించాలి

విధుల్లో ఉండే మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచాలి. రాత్రి సమయంలో డ్యూటీ చేసే మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బంది ఇబ్బంది పడకుండా పోలీసులతో గస్తీ నిర్వహించాలి. ఆస్పత్రి వద్ద పగలు, రాత్రి సమయంలో వాచ్‌మెన్లను ఏర్పాటు చేయాలి. వైద్యులు, సిబ్బందిపై కొంత మంది దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– గౌతమి, వైద్యురాలు, గార్లదిన్నె పీహెచ్‌సీ



న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన



బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 5 రోజుల్లో చిరు జల్లుల నుంచి తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 32.0–35.0, రాత్రి ఉష్ణోగ్రతలు 23.0–23.8 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 68–78 శాతం, మధ్యాహ్నం 54–78 శాతంగా నమోదవుతాయన్నారు.

'పచ్చ గద్దల'పై అధికారుల దృష్టి

సాక్షి ఎఫెక్ట్..

పామిడి: అధికార మదంతో దేవుడి మాన్యంపై సైతం కన్నేసిన 'పచ్చ గద్దల'పై అధికారులు దృష్టి సారించారు. పామిడి పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో ఆంజనేయ స్వామి మాన్యంలో ఉన్న టంగుటూరి సత్రాన్ని సోమవారం టీడీపీ నాయకులు కూల్చివేసిన విషయం తెలిసిందే. రూ. 5 కోట్ల వరకూ విలువ చేసే మాన్యాన్ని కొట్టేయాలనే ఉద్దేశంతో ముందుగా సత్రాన్ని పడగొట్టిన విషయంపై 'సాక్షి'లో 'పవన పుత్రుడి మాన్యంపై పచ్చగద్దలు' శీర్షికన కథనం వెలువడడంతో అధికారులు స్పందించారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస రెడ్డి మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ జీ.లక్ష్మినారాయణరెడ్డితో మాట్లాడారు. ఆంజనేయస్వామి మాన్యం వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. బుధవారం (నేడు) పురావస్తు శాఖ ఏడీ ఆధ్వర్యంలో కూల్చివేసిన సత్రం స్థలాన్ని పరిశీలించి నివేదిక అందించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను ఆదేశించారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు సావిత్రమ్మ కన్నుమూత



అనంతపురం కల్చరల్: మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడిచిన స్వాతంత్య్ర సమరయోధురాలు, భగవద్గీతను ఆంగ్లంలోకి అనువదించి విస్తృత ప్రచారం చేసిన ఆధ్యాత్మికవేత్త బండారు సావిత్రమ్మ (101) కన్నుమూశారు. కోర్టురోడ్డులోని తన నివాసంలో సోమవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. సావిత్రమ్మ తెలుగు, కన్నడ, ఇంగ్లిష్, హిందీ భాషల్లో అనర్గళంగా మాట్లాడేవారు. దేశంలో స్వాతంత్య్ర పోరాటం తీవ్రంగా జరుగుతున్న సమయంలో మహాత్ముని పిలుపునందుకున్న సావిత్రమ్మ తన భర్త శ్రీనివాసరావుతో కలిసి అనంతపురం నుంచి ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించారు. ఈ ప్రాంత మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. కొన్ని రోజులుగా భగవద్గీత ప్రచారానికి తన జీవితాన్ని సావిత్రమ్మ అంకితం చేశారు. భగవద్గీతలోని అన్ని శ్లోకాలను అనర్గళంగా చెప్పేవారు. వాటికి సొంతంగా భాష్యాలు రాశారు. సావిత్రమ్మకు ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తహసీల్దార్‌గా పనిచేసి పదవీ విరమణ అనంతరం హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న ఆమె కుమారుడు మధుసూదనరావు 'సాక్షి'తో మాట్లాడారు. తమ తల్లి ఆశయాలను పూర్తి చేస్తామని తెలిపారు. ఘంటసాల ఆరాధన సమితి అధ్యక్షులు పాలసముద్రం నాగరాజు, యాదవల్లి సుబ్రమణ్యం, కేవీఎస్ చలపతిరెడ్డి, బ్రాహ్మణ సంఘం నాయకులు అట్టి కేదార్‌నాథ్, యాగంటి రామకృష్ణారెడ్డి తదితరులు సావిత్రమ్మ ఆదర్శప్రాయ జీవితాన్ని గుర్తు చేసుకున్నారు.

డ్రిప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయండి

అనంతపురం సెంట్రల్: జిల్లా వ్యాప్తంగా డ్రిప్, స్ప్రింక్లర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ ఆదేశించారు. మంగళవారం ఏపీఎంఐపీ కార్యాలయంలో డ్రిప్ కంపెనీ డీసీఓలు, ఎంఐ ఇంజినీర్లతో వారు సమావేశమై మాట్లాడారు. ఇప్పటి వరకూ 38 వేల హెక్టార్లకు 28 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాకు ఈ ఏడాది అత్యధికంగా 37,500 హెక్టార్లు టార్గెట్ ఇచ్చారని, అర్హత ఉన్న ప్రతి రైతుకూ డ్రిప్ పరికరాలు ఇవ్వడానికి అవకాశముందని తెలిపారు.

పేరులో చిన్న..అవినీతి మిన్న

ఆయనెక్కడ పనిచేసినా అవినీతిలో మునిగితేలుతారు. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తారు. స్టేషన్ కొచ్చే బాధితుల బాధలు విని సాంత్వన చేకూర్చడం మాని, ఆ సమస్య పరిష్కరిస్తే తనకెంత ముట్టజెబుతారో అడుగుతారు. విసుగెత్తిన ఓ బాధితుడు గతంలో ఏసీబీ అధికారులకు సమాచారమిస్తే.. చివరి నిమిషంలో వారికి చిక్కకుండా ఉడాయించారు. పోలీసు వ్యవస్థ ప్రతిష్టను దిగజార్చి సస్పెన్షన్‌కు గురయ్యారు. అవినీతికి కేరాఫ్‌గా చెప్పుకునే అలాంటి వ్యక్తి నేడు కూటమి ప్రభుత్వంలో ఓ ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకుని పోస్టింగ్ తెచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది.



- పోలీసు శాఖలో అత్యంత అవినీతిపరుడిగా ముద్ర వేసుకున్న చిన్న గౌస్
- పైస్థాయి అధికారులను మేనేజ్ చేయడంలో దిట్ట
- ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడే సమయంలో పరార్
- నేడు సస్పెన్షన్ ఎత్తివేసి పోస్టింగ్ ఇచ్చేందుకు అమాత్యుల యత్నం
- ఉరవకొండకు పోస్టింగ్ ఇచ్చేందుకు సన్నాహాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఖాకీ వనంలో కలుపు మొక్కగా పేరుగాంచిన పోలీసు అధికారి చిన్నగౌస్‌కు మళ్లీ పోస్టింగ్ ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో అత్యంత అవినీతిపరుడిగా ముద్రవేసుకున్న చిన్న గౌస్.. అధికారులను మేనేజ్ చేయడంలోనూ, ప్రజాప్రతినిధుల అవసరాలకు అనుగుణంగా లోపాయికారీగా వ్యవహరించడంలోనూ అత్యంత నేర్పరి అని పేరుంది. ఎమ్మెల్యే, మంత్రుల అండతో పోలీసు డిపార్ట్‌మెంట్‌లోని పెద్దలను కూడా లెక్కచేయరనే విమర్శలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏ స్టేషన్‌లో పనిచేసినా వివాదాస్పద పోలీసుగా, అవినీతిపరుడిగా ముద్రపడటం గమనార్హం. గతంలో సస్పెండ్ అయిన ఆయనకు మళ్లీ పోస్టింగ్ ఇచ్చి తమకు అనుకూలంగా పనిచేయించుకోవాలని నేడు అమాత్యులు, టీడీపీ నాయకులు భావిస్తున్నారు.



చిన్న గౌస్

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునే సమయంలో..

గతంలో రామగిరి పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేసిన చిన్నగౌస్.. ఓ కేసులో అవినీతికి సంబంధించి ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటారనే సమయంలో జంప్ అయ్యారు. వరకట్న వేధింపుల కేసులో వ్యక్తి నుంచి రూ.5 లక్షలు డిమాండ్ చేసి చివరకు రూ.3 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో రామగిరి ఎస్ఐ, సీఐ చిన్నగౌస్ ప్రధాన నిందితులు. ఈ క్రమంలోనే బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఎస్ఐ పట్టుబడ్డారు గానీ చిన్నగౌస్ అక్కడి నుంచి పరారయ్యారు. ఆ తర్వాత ఆయన్ను అప్పటి ఎస్పీ సస్పెండ్ చేశారు. ఇప్పటివరకూ సస్పెన్షన్ ఎత్తేయలేదు. నేడు ప్రభుత్వం మారడంతో మళ్లీ పోస్టింగ్ తెచ్చుకునేందుకు ఆయన పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఉరవకొండ సీఐగా వచ్చేందుకు టీడీపీ నేతలను ఆశ్రయించినట్టు సమాచారం.

ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా వచ్చి..

వాస్తవానికి చిన్నగౌస్ సివిల్ పోలీస్ విభాగానికి చెందిన వారు కాదు. ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత మినిస్టీరియల్ కోటాలో భాగంగా సివిల్ పోలీస్ విభాగంలోకి చేరారు. కంబదూరు మొదలుకొని పలు స్టేషన్లలో ఎస్ఐగా పనిచేశారు. ఎక్కడ పనిచేసినా వివాదం సృష్టించడం, సెటిల్‌మెంట్లు చేయడం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య అని పోలీసు విభాగంలో చెప్పుకుంటారు. రాజకీయ నేతలకు వంతపాడి, వారితో అంటకాగుతూ వారి ప్రత్యర్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడంలో గౌస్‌కు మించిన వారు మరొకరు లేరనే పేరుంది. అలాంటి వ్యక్తికి నేడు సస్పెన్షన్ ఎత్తేసి తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని చూస్తుండటం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

దులీప్ ట్రోఫీకి పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం అర్బన్: ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో జరగనున్న దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచుల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జేసీ శివ నారాయణ శర్మ, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌తో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరు 5 నుంచి 22 వరకు జరగనున్న ట్రోఫీలో భారత క్రికెట్ జట్టు క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ప్రొటోకాల్ ప్రకారం ఫైర్ సేఫ్టీ, డిజాస్టర్ రెస్పాన్స్ మెకానిజం పాటించాలన్నారు. అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలన్నారు. మ్యాచ్‌లు వీక్షించేందుకు బీసీసీఐ సెలెక్టర్ అజిత్ అగార్కర్, కామెంటేటర్లు, క్రీడాకారులు వస్తున్న నేపథ్యంలో వీఐపీ జాబితా సిద్ధం చేయాలన్నారు. డీఎస్‌డీఓ కోచ్‌లను వలంటీర్లుగా నియమించాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓ, నగర పాలక కమిషనర్, డివిజన్ స్థాయి అధికారులు, జాయింట్ కలెక్టర్ రోజూ పరిశీలించాలని చెప్పారు. క్రికెటర్లు బసచేసే హోటళ్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల విద్యార్థులకు రొటేషన్ పద్ధతిలో పాసులు అందించాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ జి.రామకృష్ణా రెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆదిత్యవర్మ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీ భవనాలు పూర్తి చేయండి

బుక్కరాయసముద్రం: సెంట్రల్ యూనివర్సిటీలో భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీని ఆయన పరిశీలించారు. అనంతపురం–తాడిపత్రి ప్రధాన రహదారి నుంచి సెంట్రల్ యూనివర్సిటీ అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన కాంపౌండ్ పనులు ప్రారంభించాలన్నారు. తాగునీటి సరఫరా కోసం టెండర్ల ప్రక్రియ చేపట్టాలన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ వర్సిటీ వీసీ కోరి, పంచాయతీ రాజ్ ఎస్ఈ ప్రసాద్, హెచ్ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

1న ఎన్‌డీఏ, ఎన్ఏ, సీడీఏ పరీక్షలు

- జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం అర్బన్: 'నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నావెల్ అకాడమీ (ఎన్ఏ), కంబైన్డ్ డిఫెన్స్ అకాడమీ (సీడీఏ) పరీక్షలు సెప్టెంబరు 1వ తేదీన జరగనున్నాయి. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి' అని జేసీ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. మంగళవారం డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో రూట్ ఆఫీసర్లు, లోకల్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్లు, పోలీసు, వైద్యారోగ్య, విద్యుత్, కార్మిక, పోస్టల్, ఆర్‌టీసీ, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు కేంద్రాల్లో జరగనున్న పరీక్షలకు 238 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. జేఎన్‌టీయూ కేంద్రంలో నిర్వహించే సీడీఏ పరీక్షకు 104 మంది, కేఎస్ఎన్ పీజీ కళాశాల కేంద్రంలో ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్షకు 134 మంది హాజరవుతారన్నారు. సీడీఏ పేపర్–1 ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, పేపర్–3 మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్షలకు సంబంధించి పేపర్–1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు పరీక్ష కేంద్రాలకు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఇద్దరు లోకల్ ఇన్‌స్పెక్టింగ్ అధికారులు, ఇద్దరు రూట్ అధికారులను నియమించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు నిర్ణీత పరీక్ష సమయం కంటే గంట ముందే చేరుకోవాలన్నారు. 30 నిమిషాలు ముందు కేంద్రాన్ని మూసివేస్తారని, ఆ తరువాత లోపలికి అనుమతించరన్నారు. ఈ–అడ్మిట్ కార్డుతో పాటు ఆధార్, పాన్, ఓటర్ ఐడీ తదితర గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. కేంద్రంలోకి పెన్, పెన్సిల్ మాత్రమే అనుమతిస్తారని, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర కమ్యూనికేషన్ డివైజ్‌లు, స్మార్ట్, డిజిటల్ వాచ్‌లను అనుమతించరని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న జేసీ శివ నారాయణ శర్మ, చిత్రంలో డీఆర్ఓ రామకృష్ణారెడ్డి

కుంటుపడుతున్న విద్యాభివృద్ధి

- సమగ్ర శిక్షలో సెక్టోరియల్ అధికారులు లేక దుస్థితి
- ఉన్నవాళ్లకు వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి రాత్రికిరాత్రే రిలీవ్ చేయించిన కీలక అధికారి
- కొత్త వాళ్లను తీసుకునేందుకు హడావుడిగా నోటిఫికేషన్
- 20 రోజులు దాటినా దరఖాస్తుల స్క్రూటినీకి అతీగతి లేని వైనం
- అసంబద్ధ నిర్ణయాలతో భ్రష్టు పట్టిన 'సమగ్ర శిక్ష'

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలులో అత్యంత కీలకమైన సమగ్ర శిక్షలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు లేక పథకాల అమలు కుంటు పడుతోంది. ఏఎంఓ, అసిస్టెంట్ ఏఎంఓలు, అలెస్కో, సీఎంఓ, జీసీడీఓ, ఏఎస్ఓ, ఐఈ కోఆర్డినేటర్‌ను రీప్యాట్రియేషన్ చేస్తూ గతనెల 31న కలెక్టర్ వినోద్‌కుమార్ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టర్‌ను తప్పుదోవ పట్టిస్తూ సమగ్ర శిక్ష నుంచి ఫైలు పెట్టడం వెనుక ఓ అధికారితో పాటు ఒక సీనియర్ అసిస్టెంట్ కీలకంగా వ్యవహరించారు. ఫైలును నడిపిన విధానం చూస్తే ఆ అధికారి కక్షకట్టి మరీ వ్యవహరించినట్లు స్పష్టమవుతోంది. గతంలో కలెక్టర్ ఆమోదం ద్వారానే వీరందరూ వచ్చారు. అయితే, నిబంధనలకు విరుద్ధమంటూ ఆ కలెక్టర్ నిర్ణయాన్ని తప్పుపడుతూ ప్రస్తుత కలెక్టర్‌కు ఫైలు పెట్టారు. ఇందులో ప్రతిలైనూ తప్పులతడకగానే ఉంది. రిలీవ్ ఫైలుపై కలెక్టర్‌తో అర్ధరాత్రి సంతకం చేయించారు. సెక్టోరియల్ అధికారులను రిలీవ్ చేయకుండానే కలెక్టర్ పేరుతో కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయించారు. చివరకు తాను తీసుకోవాల్సిన సీనియర్ అసిస్టెంట్ల రిలీవ్ నిర్ణయం కూడా కలెక్టర్‌కు ఫైలు పెట్టి తన చేతికి మట్టి అంటకుండా ఆయనపై తోసేశారు. ఎవరు అడిగినా 'అది కలెక్టర్ నిర్ణయం.. నా చేతుల్లో ఏముందని' చెబుతూ వచ్చారు. అసలు విషయం కలెక్టర్‌కూ తెలిసిపోవడంతో సదరు అధికారిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.



దరఖాస్తులు సరే.. స్క్రూటినీ ఏదీ?

సెక్టోరియల్ అధికారుల పోస్టులకు 110 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 9తో దరఖాస్తు గడువు ముగిసింది. ఆ వెంటనే స్క్రూటినీ చేపడతామని అధికారులు ప్రకటించారు. 20 రోజులు దాటినా ఇప్పటికీ అతీగతీ లేదు. వీటి గురించి పట్టించుకునేనాథుడే లేడు.

అసంబద్ధ నిర్ణయాలతో అస్తవ్యస్తం..

సదరు అధికారి తీసుకున్న నిర్ణయాలతో జిల్లాలో సమగ్ర శిక్ష భ్రష్టు పడుతోంది. ఎస్పీడీ నిర్వహించే కాన్ఫరెన్సులు, వెబెక్స్‌లలో డీపీసీ హోదాలో ఆ అధికారి హాజరైన సందర్భాలు వేళ్ల మీద లెక్కించొచ్చని సిబ్బంది చెబుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వం అమలు చేసే విద్యాభివృద్ధి కార్యక్రమాలన్నీ సమగ్రశిక్ష ద్వారా పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాంటి కార్యాలయాన్ని పర్యవేక్షణ అధికారులు లేనిదిగా మార్చారు. ఈ అధికారి తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలతో జిల్లాలో సమగ్ర శిక్ష భ్రష్టు పడుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చిపెడుతోందని డీఈఓ, సమగ్రశిక్ష కార్యాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వాపోతున్నారు.

బొక్క 'బార్లా' తప్పదా?

- వైన్‌షాపులకు పర్మిట్ రూములిస్తారని బార్ల యాజమాన్యాల భయం
- లైసెన్సు రెన్యూవల్ చేసుకునేందుకు జంకుతున్న వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు వ్యవహారం బార్ల యాజమాన్యాలను భయపెడుతోంది. అక్టోబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ వస్తుందని ఇప్పటికే చంద్రబాబు సర్కారు ప్రకటించింది. ఈ క్రమంలో పర్మిట్ రూములు, బెల్టు షాపులు అమల్లోకి తేనున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 26 బార్ల యాజమాన్యాలు బార్ల లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలా? వద్దా? అనే సందిగ్ధంలో పడిపోయారు.

పర్మిట్ రూములిస్తే..?

ఆగస్ట్ 31లోపు బార్లన్నీ లైసెన్సును పునరుద్ధరణ చేసుకోవాల్సి ఉంది. ఒక్కో బారు కనిష్ఠంగా కోటి రూపాయల వరకూ చెల్లించాలి. లైసెన్సు ఫీజు గడువు లోగా చెల్లించకపోతే సెప్టెంబర్ 1 నుంచి బార్లు మూసుకోవాల్సి వస్తుంది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. అక్టోబర్ 1 నుంచి ప్రైవేటు వ్యక్తులకు బ్రాందీ షాపులు సర్కారు ఇవ్వనున్నట్టు ప్రచారం జరుగుతుండడం బార్ల యజమానులను కలవరపెడుతోంది. ప్రతి వైన్‌షాపు సమీపంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులకు పర్మిట్ రూములకు అనుమతులు ఇవ్వనున్నట్టు చర్చ జరుగుతోంది. ఇదే జరిగితే బార్లకు రావడానికి ఎవరూ ముందుకు రారని యాజమాన్యాలు భయపడుతున్నాయి. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014–19 మధ్యకాలంలో రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా బెల్టుషాపులు ఏర్పాటు కావడాన్ని గుర్తు చేసుకుని లోలోనే కుమిలిపోతున్నారు.



ఇప్పటికే బహిరంగ మద్యం..

ఈ ఏడాది జూన్4న ఎన్నికల ఫలితాలు వచ్చాయి. జూన్ 12న కూటమి సర్కారు కొలువుదీరింది. ఆరోజునుంచే ఉమ్మడి జిల్లాలో బహిరంగ మద్యం ఏరులై పారుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడైనా బహిరంగంగా మద్యం విక్రయిస్తే సెబ్ అధికారులు కేసులు నమోదు చేసేవారు. తాగితే బార్లలో తాగాలి, లేదంటే వైన్‌షాపు నుంచి తీసుకెళ్లాల్సి ఉండేది. రాత్రి 9 గంటలు దాటితే మద్యం షాపులు మూసి వేసేవారు. కానీ ఇప్పుడు ఏ హోటల్‌కు వెళ్లినా, ఏ ధాబాకు వెళ్లినా మద్యం దొరుకుతోంది. మద్యం ప్రియులతో హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. ఒక్క అనంతపురం నగరంలోనే 50 నుంచి 60 హోటళ్లు బార్లను తలపిస్తున్నాయి. సెబ్ అధికారులు హోటళ్ల నిర్వాహకులతో మిలాఖత్ అయి తనిఖీలు గాలికొదిలేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు బార్ల యజమానులు ఏమైతే అదవుతుందంటూ భయం భయంగానే డబ్బు చెల్లించి రెన్యూవల్ చేసుకున్నట్లు తెలిసింది.

గోడౌన్‌కు కప్పం కట్టాల్సిందే

ఎక్సైజ్, సెబ్ అధికారుల పెత్తనానికి తోడు ఇటీవల లిక్కర్ గోడౌన్ అధికారుల పెత్తనం పెరిగిపోయినట్లు తెలిసింది. గోడౌన్ నుంచి సరుకు బార్లకు రావాలంటే నెలకు ఒక్కో బారు యజమాని రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఇవ్వాల్సిందేనంటున్నారు. లేదంటే సరుకు డ్యామేజీ లేదా బ్రాండ్లు లేవని రకరకాలుగా ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై గోడౌన్ అధికారిని వివరణ కోరగా, అలాంటిదేమీ లేదని దాట వేశారు.

బదిలీల్లో వివాదాలకు తావివ్వొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, తదితరులు

అనంతపురం అర్బన్: ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో వివాదాలు, ఆరోపణలకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బదిలీల అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియారిటీ ప్రాతిపదికన బదిలీలు నిర్వహించాలన్నారు. కేడర్ వారీగా జాబితా సిద్ధం చేయడంతో పాటు ఖాళీల వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. ఏ దశలోనూ విమర్శలకు తావ్వకూడదని కచ్చితమైన ఆదేశాలిచ్చారు. సమావేశంలో డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ, డీటీసీ వీర్రాజు, డీపీఓ ప్రభాకర్ రావు, పరిశ్రమల శాఖఅధికారి నాగరాజారావు, తదితరులు పాల్గొన్నారు.

'అమృత్' వేగవంతం కావాలి

'అమృత్' 1.0 పథకం కింద చేపట్టిన పనులు వేగవంతం చేయాలని, అమృత్ 2.0 కింద పనులను గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రిలో రూ.265 కోట్లతో చేపట్టిన పనులు వేగవంతం చేయాలన్నారు. అమృత్ 2.0 కింద అనంతపురం నగర పాలక సంస్థ, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుత్తి మునిసిపాలిటీల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ.283.89 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. తాగునీటి సరఫరా పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, నగర పాలక కమిషనర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'కేఎస్ఎన్'లో మెగా జాబ్‌మేళా



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ శంకరయ్య

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. దాదాపు 15 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. మౌఖిక పరీక్షల్లో 681 మంది వివిధ ఉద్యోగాలకు అర్హత సాధించారు. షైన్ కన్సల్టెన్సీ సర్వీసు, ఫ్లిప్‌కార్ట్, ఫాక్స్ కాన్, హెటిరో, మేడ్ కోడ్, రిలయన్స్ సర్వీస్, పేటీఎం, విప్రో, టాటా ఎలక్ట్రానిక్స్, ఎన్సోర్స్, తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువతీయువకులు 951 మంది హాజరయ్యారు, ఆయా ఉద్యోగాలకు అర్హత పొందిన వారికి నియామక పత్రాల్ని కళాశాల ప్రిన్సిపాల్ పి. శంకరయ్య చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, జేకేసీ ప్లేస్‌మెంట్ సెల్, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్, బి.అనురాధ. జేకేసీ మెంటర్స్ ఎ.అనూష, పి.సింధూరి, రమణనాయుడు, రామాంజనేయులు, జేఎస్ పర్వీన్ పాల్గొన్నారు.

ఎస్ఐల బదిలీ

అనంతపురం సెంట్రల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 మంది ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మవరం నుంచి శ్రీనివాస్‌ను అనంతపురం వన్‌టౌన్‌కు, ఇక్కడ పనిచేస్తున్న రామకృష్ణను వీఆర్‌కు, పుట్టపర్తిలో వీఆర్‌లో ఉన్న సుధాకర్ యాదవ్‌ను అనంతపురం టూటౌన్‌కు, ఇక్కడ పనిచేస్తున్న రుషేంద్రబాబును వీఆర్‌కు, డీసీఆర్‌బీలో ఉన్న రామ్‌ప్రసాద్‌ను అనంతపురం ఫోర్త్ టౌన్‌కు, ఇక్కడ ఉన్న నాగమధును కణేకల్లుకు, అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులను వీఆర్‌కు, పీటీసీలో ఉన్న రాంబాబును అనంతపురం రూరల్‌కు, పుట్టపర్తి వీఆర్‌లో ఉన్న విజయ్‌కుమార్‌ను ఇటుకలపల్లికి, గుత్తిలో పనిచేస్తున్న నబీరసూల్‌ను బొమ్మన్‌హాళ్‌కు బదిలీ చేశారు.



ప్రత్యేక చట్టాలు రూపొందించాలి

మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించే అంశాన్ని ప్రభుత్వాలు తప్పనిసరిగా బాధ్యతగా గుర్తించాలి. రోగి ఎంత బాధలో ఉన్నా డాక్టర్‌ను చూడగానే వారిలో ధైర్యం వస్తుంది. ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకపోతే సమాజంలో మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. కోల్‌కతాలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళా డాక్టర్ల భద్రతకు భరోసా కల్పించాలి. ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టాలి. వైద్యులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలను రూపొందించాలి.

– డాక్టర్ ఆసియా, పీహెచ్‌సీ వైద్యాధికారి, కంబదూరు



సామాజిక చైతన్యంతోనే రక్షణ

ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడి వారి ముఖాల్లో ఆనందం చూడాలన్నదే ప్రతి వైద్యుడి కోరిక. ప్రత్యక్ష దైవాలుగా భావించే వైద్యులు, సిబ్బందికే రక్షణ కరువైతే ఎలా? వైద్యుల పట్ల కఠినంగా వ్యవహరించడం మానుకోవాలి. మహిళా వైద్యులు, సిబ్బంది భద్రతకు కఠిన చట్టాలు అమలు చేయాలి. రాత్రి వేళల్లో ఆస్పత్రుల వద్ద పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలి. వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడితే విధించే శిక్షల వివరాలతో కూడిన బోర్డులను ప్రతి ఆస్పత్రిలోనూ ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ బి.సజీవ్, మెడికల్ ఆఫీసర్, యూపీహెచ్‌సీ, గుంతకల్లు



గుడ్డు వెనుక గూడుపుఠాణి!

- రాయదుర్గం లోని మధు టాకీస్ ప్రాంతంలో ఉన్న ఓ అంగన్‌వాడీ కేంద్రంలో కూటమి ప్రభుత్వం అందజేసిన కోడి గుడ్లు గోలిగుండ్లను తలపించాయి. వీటిని చూసిన బాలింతలు, గర్భిణులు అవి కోడి గుడ్లు కాదేమోననే అనుమానాలు వ్యక్తం చేస్తూ తీసుకునేందుకు వెనుకంజ వేశారు. దీంతో పరిమాణంలో మరీ చిన్నగా ఉన్న గుడ్లను పక్కన పెట్టి పెద్దవాటిని ఉడికించి ఇస్తున్నారు.
- డి.హీరేహాళ్‌లోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం సరఫరా చేసిన కోడిగుడ్ల ట్రేల్లో పరిమాణంలో చిన్నవిగా ఉన్నవే ఎక్కువగా కనిపించాయి. అయితే ఈ విషయంపై సరఫరా ఏజెన్సీని ప్రశ్నించలేక అంగన్‌వాడీ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ట్రేల చొప్పున లెక్కించి ఉడికిస్తామని, ఎవరికి ఏ గుడ్డు వచ్చినా తీసుకోవాల్సిందేనని ఆయా చెబుతోంది.

.... ఇలాంటి సమస్యలు ఈ రెండు ప్రాంతాల్లోనే కాదు... జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సరఫరా పేరుతో నాణ్యతలేని, పరిమాణంలో మరీ చిన్నగా ఉన్న కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



గోలీలకంటే కాస్త పెద్ద సైజులో ఉన్న కోడిగుడ్లు



అంగన్‌వాడీ కేంద్రాల్లో నిల్వ చేసిన కోడిగుడ్లు

- పేదల పౌష్టికాహారంపై కూటమి సర్కార్ చిన్నచూపు
- తక్కువ పరిమాణంలో ఉన్న కోడిగుడ్ల పంపిణీ
- సరఫరా ఏజెన్సీల ఇష్టారాజ్యం
- ప్రశ్నించలేని స్థితిలో అంగన్‌వాడీ సిబ్బంది
- తింటే ఏమవుతుందోనని గర్భిణుల ఆందోళన

జిల్లాలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	2,302
ప్రధాన కేంద్రాల సంఖ్య	2,073
మినీ కేంద్రాల సంఖ్య	223
మొత్తం బాలింతలు	16,681
మొత్తం గర్భిణులు	17,594
7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లల సంఖ్య	81,322
3 సం. నుంచి ఆరేళ్ల లోపు ఉన్న పిల్లల సంఖ్య	41,238

రాయదుర్గం: పౌష్టికాహారం పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న కోడిగుడ్లలో 'చిన్న' చూపు కనిపిస్తోంది. పరిమాణంలో చిన్నగా ఉన్న గుడ్లను చూడగానే అందరిలోనూ అవి కోడి గుడ్లు కాదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వాటిని తీసుకునేందుకు లబ్ధిదారులు నిరాకరిస్తున్నారు.

కోడిగుడ్డు నాణ్యత నగుబాటు..

జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు ప్రతి నెలా 2.5 లీటర్ల పాలు, 2.50 కిలోల బాలామృతం, 25 కోడి గుడ్లు, గర్భిణులు, బాలింతలకు 25 కోడిగుడ్లు ఇస్తారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు 100 గ్రాముల పాలు, కోడిగుడ్డు, నాణ్యమైన భోజనం అందిస్తారు. ఇందులో ఎక్కువ క్యాలరీలుంటాయని చెప్పుకునే కోడిగుడ్డులో నాణ్యత నగుబాటైంది. దీనిపై ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు భయపడుతున్నారు.

కాంట్రాక్టర్లకు కాసుల వర్షం..

అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా అనేది కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. సాధారణంగా ఓ గుడ్డు 50 గ్రాముల బరువుండాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్లను సరఫరా చేసే ఏజెన్సీ నిర్వాహకులు చాలా వరకూ నాసిరకంగా ఉన్న వాటినే అందజేస్తున్నారు. తక్కువ పరిమాణంలో ఉన్న గుడ్లు, మురిగిపోయి కుళ్లు వాసన వస్తున్నవి సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారు. గుడ్లు చిన్నగా ఉంటున్నాయని, ఉడికించిన వెంటనే కొన్ని నెర్రలు చీలి దుర్గంధం వస్తోందని గర్భిణులు, బాలింతలు చేస్తున్న ఫిర్యాదులు బుట్టదాఖలు అవుతున్నాయి. 30 గ్రాముల్లోపే బరువున్న కోడిగుడ్లను చూడగానే తీసుకునేందుకు తటపటాయిస్తున్నారు.

తింటే ఏమవుతుందో...



గర్భస్థ సమయంలో కోడి గుడ్లు బాగా తినాలని డాక్టర్లు చెబుతున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తున్నవి కోడి గుడ్లేనా అనే అనుమానం వస్తోంది. ఇవి తింటే ఏమవుతుందోనని చాలా మంది భయపడుతున్నారు.

– ఎస్.ఉమాదేవి, గర్భిణి, రాయదుర్గం

నీటిలోనే చీలిపోతున్నాయి



నీటిలో ఉడికేస్తుండగానే చీలిపోయి చెడు వాసన వేస్తున్నాయి. రెండు నెలలుగా ఇదే పరిస్థితి. కోడిగుడ్లు తినాలంటేనే భయమేస్తోంది. అనవసరంగా నాలాంటి బాలింతల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

– రేష్మా, బాలింత, రాయదుర్గం

భయమేస్తోంది



అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే కోడిగుడ్డు తినాలంటే భయపడుతున్నాం. ట్రే లో ఆరు గుడ్లు బాగుంటే మిగిలినవి మరీ చిన్నగా ఉంటున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లు నాణ్యతగా ఉండేలా చూడాలి.

– నీలావతి, బాలింత, 74 ఉడేగోళం

చిన్నవైతే వెనక్కి ఇచ్చేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన కోడిగుడ్లు మాత్రమే సరఫరా చేయాలి. చిన్నవి, కుళ్లిన గుడ్లు ఉంటే వెంటనే వెనక్కి పంపేలా ఆదేశాలు ఇచ్చాం.

– శ్రీదేవి, పీడీ, ఐసీడీఎస్

యూపీఎస్‌తో 11,700 మంది ఉద్యోగులకు లబ్ధి

- డీఆర్ఎం విజయ్‌కుమార్

గుంతకల్లు: ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యునిఫైడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్) ద్వారా గుంతకల్లు డివిజన్‌లోని దాదాపు 11,700 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని డీఆర్ఎం విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తన కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీఈఎన్ కో-ఆర్డినేషన్ రామిరెడ్డి, డీపీఓ నిర్మలాఆరోరాతో కలసి ఆయన మాట్లాడారు. యూపీఎస్ ప్రయోజనాలను వివరించారు. కాగా, ఎన్‌పీఎస్, యూపీఎస్‌లో చేరే అవకాశం ఉద్యోగుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు.

అర్హులందరికీ బిందు సేద్యం పరికరాలు

కణేకల్లు: అర్హత ఉన్న ప్రతి రైతుకూ బిందు సేద్యం పరికరాలు మంజూరు చేస్తామని ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. కణేకల్లు మండలం పులచెర్లలో మంగళవారం ఆయన పర్యటించారు. రైతు ధనుంజయ్య పొలంలో ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియను, రైతు సేవాకేంద్రంలో బిందు సేద్యం పరికరాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం గ్రామంలో బిందు సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ అధికారి లక్ష్మీనారాయణ, జైన్ కంపెనీ జిల్లా ప్రతినిధి అవినాశ్ సోనావే, డీలర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ వైద్యుల నిర్లక్ష్యం.. యువకుడి బలి



మృతి చెందిన ఈశ్వరయ్య

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మేల్ మెడిసిన్ వార్డులో వైద్యుల నిర్లక్ష్యం ఓ యువకుడి ప్రాణం బలిగొంది. సకాలంలో వైద్యులు స్పందించకపోవడంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు మృతుడి బంధువులు ఆరోపించారు. వివరాలు.. తాడిపత్రి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఈశ్వరయ్య(38)కు భార్య పద్మావతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం వాంతులు, ఎక్కిళ్లతో ఇబ్బంది పడుతుంటే సర్వజనాస్పత్రిలోని ఎంఎం వార్డులో కుటుంబసభ్యులు అడ్మిట్ చేయించారు. ఈ క్రమంలో ఉదయం మెడిసిన్ వైద్యులు ఆలస్యంగా స్పందించారు. మధ్యాహ్నం తీరిగ్గా పీజీ వైద్యుడు అక్కడకు చేరుకుని మెట్రోజిల్, రిడోటిల్, స్పోర్‌ల్యాక్ మందులను ప్రైవేట్‌గా కొనుగోలు చేసుకుని రావాలని చీటి రాసిచ్చారు. దీంతో ఈశ్వరయ్య భార్య పద్మావతి సప్తగిరి సర్కిల్‌కు ఆటోలో వెళ్లి మందులు కొనుగోలు చేసుకుని వచ్చి మందులు వేయాలని స్టాఫ్‌నర్సుకు విన్నవించింది. దీంతో స్టాఫ్‌నర్సు తాము ఇంజెక్షన్ వేయకూడదని డ్యూటీ వైద్యుడు కానీ, హౌస్‌సర్జన్ కాని వచ్చి వేస్తారని, వారు వచ్చేంత వరకూ వేచి ఉండాలని సూచించింది. అయితే ఎంతసేపటికి వైద్యులు, స్టాఫ్‌నర్సు స్పందించలేదు. ఈ నేపథ్యంలోనే చీకటి పడిన తర్వాత ఉన్నఫలంగా ఈశ్వరయ్య అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అప్పుడు కుటుంబీకులు బోరున విలపిస్తూ కేకలు వేయడంతో హుటాహుటిన స్టాఫ్‌నర్సు సేవలందించేలా కవరింగ్ ఇచ్చింది. చివరకు ఈశ్వరయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా వైద్యుల నిర్లక్ష్యంతోనే ఈ దారుణం జరిగిందని మృతుని కుటుంబీకులు ఆరోపించారు. తన ముగ్గురు కుమార్తెల పరిస్థితేంటని భార్య పద్మావతి బోరున విలపించింది. ఇదిలా ఉండగా డ్యూటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, పీజీ, హౌస్‌సర్జన్ల బాధ్యతారాహిత్యంతోనే యువకుడి మృతి జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

ఎంఎం వార్డులో మరో దారుణం



ఎంఎం వార్డులో మృతి చెందిన నాగయ్యకు ఈసీజీ తీస్తున్న ఎంఎన్ఓ

మంగళవారం రాత్రి ఈశ్వరయ్య మృతి చెందిన గంటల వ్యవధిలోపే అదే వార్డులో ఎన్పీ కుంట గ్రామానికి చెందిన నాగయ్య(40) మృతి చెందాడు. చికిత్స కోసం వచ్చిన నాగయ్య... వ్యాధి నిర్ధారణలో వైద్యుల వైఫల్యం కారణంగా 10 రోజులుగా ఆస్పత్రిలోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆరోగ్యం విషమించి మంగళవారం రాత్రి ఆయన మృతి చెందాడు. ఆయనకు భార్య వేమనారాయణమ్మ, ఆరేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. కూలి పనులతో జీవనం సాగించేవాడు. కాగా, రౌండ్ ద క్లాక్ ఉండాల్సిన వైద్యులు అందుబాటులో లేకపోవడంతోనే రెండు ప్రాణాలు గాలిలో కలిసి పోయినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదిలా ఉండగా మృతిని నిర్ధారించేందుకు సాంకేతిక నిపుణుడి ద్వారా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్ఓ)తో ఈసీజీ తీయించడం మరింత వివాదాస్పదమైంది. ఈ పరిస్థితి చూస్తుంటే రోగుల పట్ల వైద్యులకు ఏ పాటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆర్‌బీఐ క్విజ్‌లో పాల్గొనండి

- డిగ్రీ విద్యార్థులకు కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎల్‌డీఎం నరసింగరావు

అనంతపురం అర్బన్: ఆర్‌బీఐ క్విజ్ పోటీల్లో పాల్గొనాలని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం తన చాంబర్‌లో ఎల్‌డీఎం నరసింగరావుతో కలసి ఆయన విడుదల చేసి, మాట్లాడారు. ఆర్‌బీఐ 90 వసంతాల పూర్తి చేసుకున్న సందర్భంగా యూజీ స్థాయిలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నారన్నారు. విద్యార్థుల్లో రిజర్వుబ్యాంక్, ఆర్థిక పర్యావరణ వ్యవస్థపై అవగాహన కల్పించేలా సెప్టెంబరులో పోటీలు ఉంటాయన్నారు. ఎల్‌డీఎం మాట్లాడుతూ ఆర్‌బీఐ క్విజ్ సాధారణ పరిజ్ఞానం ఆధారితంగా సాగుతుందన్నారు. ఆన్‌లైన్ దశతో ప్రారంభమై బహుళ స్థాయి పోటీలతో ముగుస్తుందన్నారు. జిల్లాలోని నాలుగు విశ్వవిద్యాలయాలు, 149 కళాశాలలు, 50 స్టాండ్ అలోన్ కళాశాలల విద్యార్థులందరూ క్విజ్‌లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

బహుమతులు ఇలా...

స్థాయి	ప్రథమ	ద్వితీయ	తృతీయ
రాష్ట్ర	రూ.2 లక్షలు	రూ.1.50 లక్షలు	రూ.1 లక్ష
జోనల్	రూ.5 లక్షలు	రూ.4 లక్షలు	రూ.3 లక్షలు
జాతీయ	రూ.10 లక్షలు	రూ.8 లక్షలు	రూ.6 లక్షలు

డాక్టర్ నిర్లక్ష్యమే మిస్బా ప్రాణాలు బలిగొంది!

- యర్రగుంట పీహెచ్‌సీ ఎదుట బాధిత తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన



ఆందోళనకారులకు నచ్చజెబుతున్న పోలీసులు

కణేకల్లు: యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్ నిర్లక్ష్యం వల్లనే తమ బిడ్డ చనిపోయిందని మిస్బాకౌసర్ (9) తల్లిదండ్రులు షాబీరా, పీరావలి ఆరోపించారు. తీవ్ర జ్వరంతో చికిత్స కోసం రెండు దఫాలు ఆస్పత్రికొచ్చినా సరైన చికిత్స చేయకుండా రెఫర్ చేసి చేతులు దులుపేసుకోవడంతో అల్లారు ముద్దుగా పెంచుకున్న మిస్బాకౌసర్‌ను కోల్పోవాల్సి వచ్చిందంటూ విలపించారు. డాక్టర్ విజయకుమార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బాధిత కుటుంబసభ్యులు, బంధువులు మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు యర్రగుంట పీహెచ్‌సీని ముట్టడించారు. ఉదయం ఎంపీహెచ్ఈఓ తిరుపాల్‌నాయక్, పీహెచ్‌సీ ఏఎన్ఎం, సిబ్బంది... మిస్బాకౌసర్ ఇంటి పరిసరాల్లో క్రిమి సంహారక మందు పిచికారీ చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో బాధిత కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న పాపే కనుమూసిన తర్వాత ఇలాంటి చర్యలు చేపడితే ఫలితమేమంటూ అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 2.45 గంటలకు మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది మళ్లీ ఇంటి వద్దకు చేరుకుని పరిసరాల్లో క్రిమి సంహారక మందు చల్లేందుకు సిద్ధమయ్యారు. అప్పటికే తీవ్ర వేదనతో ఉన్న కుటుంబసభ్యులు, బంధువులు ఒక్కసారిగా అధికారులపై మండిపడ్డారు. డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా తమ కుమార్తె చనిపోయిందని మండిపడుతూ ఒక్కసారిగా ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. డాక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ శంకరరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని నిరసన కారులకు నచ్చచెప్పి ఆందోళనను విరమింపజేశారు.

అంగన్‌వాడీల ధ్రువ పత్రాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి అర్బన్: తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో వయసు తగ్గించి విధుల్లో ఇంకా కొనసాగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను గుర్తించేందుకు అధికారులు విచారణ చేపట్టారు. తాడిపత్రి ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగ విరమణ వయసు దాటిపోయినా కొందరు ఇంకా విధుల్లోనే కొనసాగుతుండడంపై 'వయసు తగ్గించి.. విధుల్లోనే నక్కి' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో వెలువడిన కథనం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టాలని తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగంకు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మంగళవారం ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేపట్టారు. పదో తరగతి విద్యార్హత లేక మునుపు అంగన్‌వాడీ కార్యకర్తలుగా విధుల్లో చేరిన వారు, అనంతర కాలంలో సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి ఉత్తీర్ణత సాధించారు. ఆ సమయంలో మార్క్‌లిస్ట్‌లో వయసు తగ్గించుకుని నమోదు చేయించిన వారు దాదాపు తొలిరోజు సర్టిఫికెట్ల పరిశీలనకు దూరంగా ఉన్నట్లు తెలిసింది. రెండో రోజు ఆయాల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. కాగా, అంగన్‌వాడీ కార్యకర్తలే తీసుకువచ్చిన విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్ కార్డులో మాత్రమే ఉన్న పుట్టిన తేదీని మాత్రమే పరిశీలించి కచ్చితత్వానికి పాతర వేస్తున్నట్లుగా విమర్శలు వ్యక్తమయ్యాయి.

విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటాం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: అనంతపురంలోని బీసీ సంక్షేమ శాఖ వసతి గృహంలో సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఇంటర్ విద్యార్థి తేజ (17) మృతదేహాన్ని సర్వజనాస్పత్రిలోని మార్చురీలో మంగళవారం ఉదయం మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అధైర్యపడకూడదని, పార్టీ తరపున అన్ని విధాల అండగా ఉంటామని భరోసానిచ్చారు.

తేజ మృతిపై అనుమానాలు నివృత్తి చేయండి



ధర్నా చేస్తున్న తేజ కుటుంబసభ్యులు, బంధువులు

అనంతపురం మెడికల్: తేజ మృతిపై తమకున్న అనుమానాలను నివృత్తి చేసి, న్యాయం చేయాలంటూ కళ్యాణదుర్గం పాలవాయి చెందిన లింగమయ్య, రామలక్ష్మి (మృతుడి తల్లిదండ్రులు), బంధువులు కుళ్లాయప్ప, రాజేశ్వరి, తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థి తేజ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ అంశంలో బీసీ హాస్టల్ అధికారులు, పోలీసుల వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట మంగళవారం ఉదయం ధర్నా చేపట్టారు. తమకు న్యాయం జరిగే వరకూ అక్కడి నుంచి కదలబోమంటూ బైఠాయించారు. నగర డీఎస్పీ ప్రతాప్ అక్కడకు చేరుకుని సర్దిచెప్పినా ఫలితం లేకుండా పోయింది. తాము వచ్చే వరకూ హాస్టల్లో మృతదేహాన్ని ఉంచకుండా ఎలా తీశారంటూ ప్రశ్నించారు. తేజ మృతిపై అనుమానాలు నివృత్తి చేయాల్సిందేనంటూ పట్టుబట్టారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత వాస్తవాలు తెలుస్తాయని, దోషులు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని డీఎస్పీ భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆరా



విద్యార్థులతో ఆరా తీస్తున్న జడ్జి శివప్రసాద్

అనంతపురం సెంట్రల్: నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న బీసీ సంక్షేమశాఖ వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్ మంగళవారం సందర్శించారు. హాస్టల్‌లో వసతులు, ఇబ్బందులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి తేజ అనుమానాస్పద మృతిపై ఆరా తీశారు. ఆ రోజు ఏం జరిగిందనే అంశాన్ని మృతుని స్నేహితులను అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

జేడీఏను కలిసిన వ్యవసాయ ఉద్యోగుల సంఘం నేతలు


జేడీఏ ఉమామహేశ్వరమ్మను కలిసిన వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల నూతనంగా ఏర్పాటైన అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సరీ్వసు అసోసియేషన్ ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యవర్గ సభ్యులు మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మను కలిశారు. మర్యాదపూర్వకంగా జేడీఏను కలిసి ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని కోరినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, జిల్లా అధ్యక్షుడు బి.రాజేంద్రప్రసాద్, కార్యదర్శి ఎస్.బాలాజీనాయక్, కోశాధికారి కేఎస్ ప్రాణేష్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ సీవీ రమణారెడ్డి తెలిపారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల అందజేత


నోట్ పుస్తకాలు అందిస్తున్న సంస్థ సభ్యులు

అనంతపురం రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆద్వర్యంలో మంగళవారం రుద్రంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు శీలం జయరామప్ప మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవంగా ఉండాలన్నారు. మహనీయుల స్ఫూర్తితో సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు గంగిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సుమంగళి, ఉపాధ్యాయులు గురివిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


నగరపాలక సంస్థ ముందు ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మిక సంఘం నాయకులు

అనంతపురం కార్పొరేషన్: కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా మునిసిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు మంగళవారం నగరపాలక సంస్థ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, నాగభూషణం మాట్లాడుతూ కార్మికులకు రెగ్యులర్‌గా పనిముట్లను అందజేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, మలేరియా, గ్యార్బేజ్, కోవిడ్ కార్మికులను ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలన్నారు. కార్మికులకు డీఏ, ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సీతారాముల ఆరాధన

కనగానపల్లి: కుర్లపల్లి గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సీతారాముల సంకీర్తనారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి మాసోత్సవాల్లో భాగంగా స్థానిక రామాలయంలో టీటీడీ వారు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ఎం. చెర్లోపల్లి, చంద్రాచర్ల భజన బృందాలు శ్రీ సీతారాముల సంకీర్తనారాధన, భజన కార్యక్రమాలను నిర్వహించాయి. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఈశ్వరమ్మ, టీటీడీ ప్రచార కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాణిపాకానికి వస్తుండగా..

- మొగిలి వద్ద జీపును ఢీకొన్న ఐచర్
- 15 మంది మహిళలకు గాయాలు

బంగారుపాళెం(చిత్తూరు జిల్లా): బంగారుపాళెం మండలంలోని మొగిలి వద్ద మంగళవారం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌తో సహా 15 మంది మహిళలు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గొల్లపల్లెకు చెందిన 14 మంది మహిళలు జీపులో(క్రూష్ వాహనం) ఉదయం చిత్తూరు జిల్లాలోని కాణిపాకం వినాయకస్వామి వారిని దర్శించుకునేందుకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని మార్గమధ్యలోని మొగిలి వద్ద పలమనేరు నుంచి చిత్తూరుకు వెళ్తున్న ఐచర్ వాహనం వెనుక నుంచి ఢీకొంది. దాంతో జీపు రహదారి పక్కన పొలాల వైపునకు దూసుకుపోయింది. ప్రమాదంలో జీపులో ప్రయాణిస్తున్న కృష్ణమ్మ, నిర్మల, లక్ష్మీదేవి, ధనలక్ష్మి, మల్లమ్మ, ఈశ్వరమ్మ, రామలక్ష్మి, వెంకటమ్మ, ఐశ్వర్య, లీలావతితో పాటు మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భద్రతా చర్యలు చేపట్టాలి



ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే వైద్యులు, స్టాఫ్‌నర్సుల, ఇతర సిబ్బందికి భద్రత పెంచేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా మహిళలకు మరింత భద్రత కల్పించడంలో భాగంగా నిఘా పటిష్టం చేయాలి. వైద్యులు, సిబ్బంది స్వేచ్ఛాయుత వాతావరణంలో పని చేసేలా ఉండాలి. ప్రజలు సైతం దురుసుగా ప్రవర్తించకుండా వైద్యులతో స్నేహపూర్వకంగా మెలగాలి. సర్వజనాస్పత్రిలో పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లకు మంచి వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ హేమలత,ఐఎంఏ, ఉమెన్ వింగ్ స్టేట్ చైర్‌పర్సన్



ప్రాణాలు కాపాడుతుంటే దాడులా?

ప్రాణాపాయ స్థితిలో వచ్చిన వారికి ప్రాణం పోసే వైద్యుల పట్ల దాడులు చేయడం దారుణం. ఇటీవల కోల్‌కతాలో జరిగిన దాడి మరువకముందే తిరుపతిలోనూ వైద్యులపై దాడికి యత్నించారు. ఇలాగైతే వైద్యులు ఎలా పని చేయాలి. విధి నిర్వహణలో అభద్రతాభావంగా పనిచేయాల్సిన దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు వైద్యుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం రక్షణ చట్టం తీసుకురావాలి.

– డాక్టర్ రమాబాయి, ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకురాలు




విక్రయానికి సిద్ధం బొజ్జగణపయ్యలు

● వినాయకుడొచ్చేశాడు..!

వినాయక చవితి వేడుకలకు గణపయ్యలు సిద్ధమయ్యారు. బళ్లారి బైపాస్ నుంచి కొడిమి వరకూ, క్లాక్‌టవర్‌తోపాటు ముఖ్యమైన ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను కొనుగోలు చేసి వాహనాల్లో తరలిస్తున్నారు. విగ్రహం సైజును బట్టి రూ.4 వేల నుంచి రూ.60 వేల వరకూ అమ్ముతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, అనంతపురం


విఘ్నేశ్వరుడికి తుది మెరుగులు దిద్దుతున్న కార్మికులు


వినాయక ప్రతిమలను పరిశీలిస్తున్న కొనుగోలుదారులు


లారీలో వినాయక ప్రతిమలను తీసుకెళ్తున్న దృశ్యం

వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యాయత్నం

రాప్తాడు రూరల్: తనను ప్రేమించాలంటూ ఓ యువకుడు తరచూ ఫోన్ చేసి వేధింపులకు గురిచేస్తుండడంతో మనస్తాపం చెంది ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి ఓ యువతి డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. ఈమె సమీప బంధువు, ఫర్టిలైజర్ షాపులో పనిచేస్తున్న బుక్కరాయసముద్రానికి చెందిన బాబు తరచూ ఆమెకు ఫోన్ చేసి, తనను ప్రేమించాలని వేధించేవాడు. ఆమెకు ఇష్టం లేకపోయినా రాత్రి పూట సైతం ఫోన్‌లో వేధింపులు చేస్తుండడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె మంగళవారం ఉదయం ఇంట్లో కత్తి తీసుకుని గొంతు కోసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ప్రాణాపాయం తప్పినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం ఆస్పత్రి నుంచి నేరుగా ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని బాబుపై బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

ప్రతి రైతూ శాస్త్రవేత్తగా తయారు కావాలి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రవి

రాప్తాడురూరల్: ప్రతి రైతూ శాస్త్రవేత్తగా తయారు కావాలని వ్యవసాయ శాఖ అనంతపురం ఏడీ ఎం.రవి ఆకాంక్షించారు. మంగళవారం కందుకూరు రైతు సేవా కేంద్రంలో ఆయన అధ్యక్షతన 'ఆత్మ' శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏయే పంటలు సాగు చేయాలో వివరించారు. తమ బిడ్డలను కూడా పంటలను సాగు చేయడం పట్ల ప్రోత్సహించాలన్నారు. గ్రామంలో ప్రతి రైతుకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలు రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రత్యమ్నాయ పంట విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతూ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం వేరుశనగ, ఆముదం పంటలను పరిశీలించారు. ఏఓ జే. శశికళ, ఏఈఓ బి. మురళీకృష్ణ, ఆత్మ ఏటీఎం అనురాధ, రైతు సేవా కేంద్రం ఉద్యోగి అపర్ణ, రైతులు వెంకటస్వామి, రాగే మల్లేష్, బాలకృష్ణ, ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, శివయ్య, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేత 'సింగరాజు'


సిగరాజు రామకృష్ణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయసమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేసిన యోధుడు సింగరాజు రామకృష్ణయ్య అని ఏపీటీఎఫ్ నాయకులు కొనియాడారు. స్థానిక ఉపాధ్యాయ భవనంలో మంగళవారం రామకృష్ణయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ రామకృష్ణయ్య ఉపాధ్యాయ విద్యారంగానికి విశేష సేవలందించారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) పేరుతో సంస్థను స్థాపించారన్నారు. తర్వాత ఉపాధ్యాయ సంఘాలను ఒకే వేదికపైకి తెచ్చి 'ఫ్యాప్టో' నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. రెండుదశాబ్దాలపాటు శాసనమండలి సభ్యుడిగా, ఐక్య వేదికలైన యూఏసీ, ఫ్యాప్టో, జేసీఈ, జేఏసీ వంటి వాటిల్లో నాయకత్వ పాత్ర వహించారన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప, రాష్ట్ర కౌన్సిలర్లు వెంకటరమణ లక్ష్మీనారాయణ, నాయకులు జయ సూర్యనారాయణ, అడవి రాజు, నరసింహ, హిమగిరి, ప్రసాద్, ఎస్ఎల్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

టీచింగ్ అసిస్టెంట్ నియామకాల్లో అక్రమాలు


వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన టీచింగ్ పోస్టుల భర్తీలో అక్రమాలు జరిగాయని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక నాయకులు ఆరోపించారు. మంగళవారం ఎస్కేయూ రెక్టార్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్బంగ వారు మాట్లాడుతూ టీచింగ్ పోస్టుల భర్తీలో యూజీసీ నిబంధనలు సైతం పక్కన పెట్టారన్నారు. తమకు అనుకూలమైన వారికి ఇవ్వడానికి రూల్స్ ఫ్రేమ్ చేసుకున్నారని ఆరోపించారు. దివ్యాంగులు, ఎస్టీలకు న్యాయం చేయాలని, నిబంధనలు పాటించని శాఖల అకడమిక్ కన్సల్టెన్సీ పోస్టులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కొంకా మల్లికార్జున, నాయకులు నాగేంద్రనాయక్, మారెన్న, మూర్తి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

5కే మారథాన్ జయప్రదం చేద్దాం

అనంతపురం మెడికల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా గురువారం నగరంలోని నిర్వహించే 5కే రన్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మారథాన్ ఆర్ట్స్ కళాశాల నుంచి ఉదయం 6.30 గంటలకు ప్రారంభమై టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్, సర్వజనాస్పత్రి, కోర్టు రోడ్డు, తిరిగి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వరకు జరుగుతుందని తెలియజేశారు. 17-25 ఏళ్ల వయస్సు కల్గిన యువత పాల్గొనాలని, విజేతలకు బహుమతులను అందిస్తామని పేర్కొన్నారు.

నెలాఖరున పశుశాఖ జేడీ ఉద్యోగ విరమణ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ మేరకు ఆ శాఖ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ క్రమంలో ఈ నెల 30న గౌరవంగా వీడ్కోలు పలికేందుకు ఉద్యోగులు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే జేడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఏడీ డాక్టర్ నాగార్జున రెడ్డి కూడా స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు ప్రభుత్వం అనుమతించడంతో ఆయన కూడా అదే రోజు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో పశుసంవర్ధకశాఖకు నూతన జేడీగా ప్రస్తుతం పెనుకొండ షీప్‌ఫారంలో డీడీగా పనిచేస్తున్న డాక్టర్ వెంకటస్వామిని పదోన్నతిపై ఇక్కడకు బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కుష్టును ప్రారంభ దశలోనే గుర్తించాలి


కుష్టు విభాగం సిబ్బందితో మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమజేమ్స్

అనంతపురం మెడికల్: కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్యం అందిస్తే అంగవైకల్యం రాకుండా చూడొచ్చని కుష్టు విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ పేర్కొన్నారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలోఆ విభాగం అధికారులతో ఆమె సమావేశమయ్యారు. గత నెల 18 నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన సర్వేలో కొత్తగా 63 మందికి వ్యాధి ఉన్నట్లు గుర్తించామన్నారు. కేసును తొలిదశలోనే గుర్తించడంతో అంగవైకల్యం నుంచి రక్షించవచ్చని, కొత్త కేసు వచ్చిన ప్రాంతంలో ఫోకల్ సర్వే నిర్వహించాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. వ్యాధిపై ప్రజలకు ఉన్న అనుమానాలు, అపోహలను అవగాహన కార్యక్రమాల ద్వారా తొలగించాలన్నారు. ఇది సాధారణమైనదని, దీన్ని ఏ దశలోనైనా..బహుళ ఔషధ చికిత్సతో నయం చేయవచ్చని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు ఉచితంగా లభిస్తాయని తెలిపారు. కుష్టు విభాగం డాక్టర్ శివారెడ్డి, పారామెడికల్ అధికారి నాగన్న, హెచ్ఈఓ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు



శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు


ఉట్టికొడుతున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: ఇస్కాన్ మందిరంలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. చివరిరోజు ఇస్కాన్ వ్యవస్థాపకులు శ్రీల ప్రభుపాదుల జయంతి నిర్వహించారు. సజీవశిల్పంగా చూపురులను ఆకర్షించే ప్రభుపాదుల విగ్రహానికి చందన పుష్పాలంకార సేవలు, ఆలయంలోని రాధా పార్థసారథులకు విశేష అలంకార సేవలు నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగాయి. ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు నేతృత్వంలో సాయంత్రం సామూహిక భజనతో ఉత్సవాలకు ముగింపు పలికారు. శ్రీకృష్ణనామస్మరణతో మందిరాన్ని మార్మోగించారు.

పురవీధుల్లో రథోత్సవం

మధ్వ సంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు మూడో రోడ్డులోని ఉడుపి శ్రీకృష్ణ మఠంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం పంచామృతాభిషేకం, అలంకార సేవలు, సాయంత్రం మహారథోత్సవ వేడుకలు జరిగాయి. మఠం మేనేజర్ లక్ష్మీ నారాయణాచార్ నేతృత్వంలో వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై చిన్ని కృష్ణున్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా హారతులు పట్టి నీరాజనాలర్పించారు. మూడో రోడ్డు నుంచి మొదటిరోడ్డు మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆలయం వరకు కళాకారుల ప్రదర్శన నడుమ రథోత్సవం సందడిగా సాగింది.


చిన్నికృష్ణుడి వేషధారణలో చిన్నారి

వైద్యులకు రక్షణచట్టం తేవాలి


నివాళులర్పిస్తున్న గైనకాలజిస్టులు

అనంతపురం మెడికల్: కోల్‌కతాలో పీజీ ట్రైనీ వైద్యురాలి తరహా ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని అనంతపురం అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ షంషాద్‌బేగం, కార్యదర్శి డాక్టర్ నిస్సీ వినూత్న పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో వారు సమావేశమై ట్రైనీ వైద్యురాలికి నివాళులర్పించారు. ప్రస్తుతం వైద్యులపై దాడులు అధికమయ్యాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో విధులు నిర్వర్తించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి డాక్టర్ అరుణ, డాక్టర్ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం లేదు : ఎస్టీయూ

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను అమలు చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని, వెంటనే ఓపీఎస్ అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి కె.చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లు కృష్ణమోహన్, ఎస్.సురేష్‌బాబు, మున్సిపల్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బి. ఫణి భూషణ్ మంగళవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్) వలన ఉపాధ్యాయులకు కొత్తగా చేకూరే ప్రయోజనం ఏమీలేదన్నారు. కొన్ని నెలలుగా ఆగిన పదోన్నతులు, బదిలీలను చేపట్టాలని కోరారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ అరికట్టి, రైతులకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. యూరియా, డీఏపీ ఎరువుల కొరతపై మంగళవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. దీంతో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నారు. జిల్లాలో వరి నాట్లు ప్రారంభమైన ప్రస్తుత తరుణంలో కొన్ని చోట్ల ఎరువుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఎరువుల దుకాణాల చుట్టూ రైతులు తిరగాల్సి వస్తోందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

క్రీడల్లో ప్రోత్సహిద్దాం

అనంతపురం సెంట్రల్: విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిద్దామని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు సూచించారు. మంగళవారం ఈఈఈ సెమినార్ హాల్‌లో ఫిజికల్ డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం -2020లో భాగంగా క్రీడలను సిలబస్‌లో చేర్చాలని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడా మైదానంలో ఉండేలా ఫిజికల్ డైరెక్టర్లు కృషి చేయాలన్నారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ క్రీడాకారులకు జేఎన్‌టీయూఏ అని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వసుంధర,స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి, డాక్టర్ ఎం. రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మంజునాథునికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలతో బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. అనంతరం పార్వతి దేవికి పూజలు నిర్వహించి మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

12 టన్నుల టమాట సేకరణ

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక కక్కలపల్లి మండీలో మంగళవారం జరిగిన వేలం ప్రక్రియలో 12 టన్నుల టమాటను కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్, రైతుబజార్ ఎస్టేట్ అధికారి ప్రతాప్ తెలిపారు. కిలో రూ.14 చొప్పున రైతుల నుంచి సేకరించి విజయవాడ రైతుబజార్‌కు పంపినట్లు తెలిపారు. మండీలో నో సేల్‌కు తావులేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టర్, మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైనప్పుడు మార్కెటింగ్‌శాఖ ద్వారా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

కొనసాగిన కృష్ణాష్టమి వేడుకలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం రెండో రోజూ కొనసాగాయి. ఈసందర్భంగా అర్చకులు శ్రీ కృష్ణ పరమాత్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇదిలా ఉండగా బుధవారం శ్రీ కృష్ణ పరమాత్ముడి విగ్రహాన్ని పూలపల్లకీపై గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.